ఆధ్యాత్మికం



కలియుగ వైకుంఠవాసుడు.. భక్తవత్సలుడైన శ్రీనివాసుడు ఉత్సవాల ప్రియుడు. అందుకే ఆయనకు ఏడాది పొడవునా ఏదో ఒక ఉత్సవం జరుపుతూనే ఉంటారు. ఇందులో భాగంగా మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని మలయప్ప స్వామి పక్షిరాజైన గరుడుడిపై విహరించారు. భక్తులకు అభయహస్తమిచ్చి, కటాక్షించారు. గరుడ వాహనసేవలో అశేష భక్తజనం పాల్గొని, హారతులు పట్టారు. స్వామివారిని తనివితీరా దర్శించుకుని ఆధ్యాత్మిక ఆనందంలో ఓలలాడారు. - తిరుమల

అధ్వాన్నం



రుయాస్పత్రిలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల తుడా నిధులతో రుయాలోని రెండు రహదారులను అభివృద్ధి చేశారు. అయితే రోగుల అవార్డులు, బాయ్స్, ఉమెన్స్ హాస్టల్‌కి వెళ్లే రహదారులు, నర్సింగ్ కాలేజ్ మార్గాలు దారుణంగా ఉన్నాయి. నడవడానికి సాధ్యం కానీ రీతిలో ఉండడంతో ముఖ్యంగా నర్సులు, వైద్య విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఆదమరిస్తే కాళ్లు బెణికి కింద పడుతున్నారు. ఈ మార్గాల్లో వెళ్లే వాహనదారుల నడ్డి విరుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి అనేక రోడ్లు కోతకు గురయ్యాయి. రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. - తిరుపతి తుడా

ఆందోళన



జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆందోళన చేశారు. నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య ,అంబేద్కర్ భవన్ చైర్మన్ పి.పరమశివన్, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.ప్రసాదరావు, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.విజయకుమార్, రచయిత గొడుగు చింత గోవిందయ్య ,ఏ.సుబ్రమణ్యం, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలక్ష్మి పాల్గొన్నారు. - తిరుపతి కల్చరల్

క్లుప్తంగా

పార్టీ అధినేతను కలిసిన మోహన్

భాకరాపేట : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షుడు సింహాల మోహన్ తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, అ న్యాయాలు, అక్రమాలను అధినేతకు వివరించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి కూడా పార్టీ కార్యక్రమాల గురించి అధినేతకు వివరించారు.

శారదకు డాక్టరేట్



శారద

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ పరిశోధన విద్యార్థిని ఎస్.శారదకు డాక్టరేట్ ప్రకటించినట్టు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఆమె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.సుజాత పర్యవేక్షణలో 'ఎవాల్యుయేషన్ ఆఫ్ సెలెక్టెడ్ ఇండియన్ మెడిసినల్ ప్లాంట్స్ ఫర్ దైర్ ఆన్ డయాబెటిక్ యాక్టివిటీ విత్ ఇన్ విట్రో అన్డ్ ఇన్ విఓ మెథడ్స్' అంశంపై పరిశోధన చేశారు.

ఎస్వీయూ డాక్టరేట్



బి రవిశంకర్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ సివిల్ ఇంజినీరింగ్ పరిశోధక విద్యార్థి బి రవిశంకర్ రెడ్డికి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డీవీ ప్రసాద్ రావు పర్యవేక్షణలో "ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ మెకానికల్ అండ్ డ్యూరబిలిటీ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లైయాష్ బేస్డ్ జియో పాలిమర్ కాంక్రీట్ బ్లెండెడ్ విత్ జీజీబీఎస్ అండ్ లైమ్ క్యూర్డ్ ఎట్ అంబిఎంట్ టెంపరేచర్" అనే అంశంపై పరిశోధన చేశారు.

విధుల బహిష్కరణ

తిరుపతి లీగల్: జస్టిస్ గవాయ్‌పై ఓ న్యాయవాది బూటు విసరడాన్ని నిరసిస్తూ తిరుపతి న్యాయవాదులు మంగళవారం విధులకు హాజరు కాలేదు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టి గజేంద్ర, ప్రధాన కార్యదర్శి విద్యానాథరెడ్డి పాల్గొన్నారు.

చెవిరెడ్డి కోసం ప్రత్యేక పూజలు



భద్రాద్రిలో వైఎస్సార్‌సీపీ నేతలు, విజయవాడలో..., కొబ్బరికాయలు కొట్టి మల్లన్నకు మొక్కుతున్న యువత



సుబ్రమణ్యస్వామికి కొబ్బరి కాయలు కొట్టి, ప్రార్థిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తిరుపతి రూరల్ : కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా అరెస్టు చేయించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణలోని భద్రాచలంలో నేతలు విడుదల మాధవ రెడ్డి, మునీశ్వర రెడ్డి, భానుకుమార్ రెడ్డి, ముచ్చేలి కిరణ్ కుమార్ రెడ్డి, తులసీ రామిరెడ్డి, ఒంటెల శేఖర్ విశేష పూజలు చేశారు. అలాగే విజయవాడలోని కనకదుర్గమ్మకు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజయ్య, సాగర్, రాజశేఖర్‌రెడ్డి, బాలు, నవీన్, మారి పూజలు చేపట్టారు. ఈ క్రమంలోనే పాకాల మండలం ఊట్లవారిపల్లె వద్ద ఆనందగిరిపై వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 516 కొబ్బరికాయలు కొట్టారు.

చెవిరెడ్డి బెయిల్ కోసం మల్లయ్యకు మొక్కులు

రామచంద్రాపురం: మద్యం అక్రమ కేసులో అరెస్ట్ అయిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి త్వరగా బెయిల్ రావాలని కోరుతూ అనుపల్లె పంచాయితీ యూత్ అధ్యక్షుడు బోడి రెడ్డి హేమంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీబుగ్గ మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మల్లయ్యకు 516 కొబ్బరికాయలు కొట్టి మొక్కారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కొండ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బాబు రెడ్డి, రమేష్ రెడ్డి, కుమార్ రెడ్డి, పురుషోత్తం, భూపతి, నరేష్ రెడ్డి, హేమశేఖర్, హేమంత్ రెడ్డి, పురుషోత్తం, భరత్, వెంకటేష్, సతీష్, మహేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభినయ్‌కు అభినందన



వైఎస్ జగన్‌తో అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: కూటమి ప్రభుత్వ మోసాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, అందరికీ ఆదర్శంగా ఉద్యమిస్తున్న భూమన అభినయ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. మంగళవారం తాడేపల్లెలోని నివాసంలో వైఎస్ జగన్‌ను అభినయ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ అబద్ధాలతో నడుస్తున్న చంద్రబాబు పాలనపై నిత్యం ఉద్యమిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తున్నను తీరును ప్రశంసించారు.

శ్రీవారి భక్తులకు అన్నదానం



శ్రీవారి భక్తులకు అన్నదానం చేస్తున్న సర్పంచ్

చంద్రగిరి: పెరటాసి మాసం సందర్భంగా దూర ప్రాంతాల నుంచి పాదయాత్రగా వస్తూ తిరుచానూరుకు చేరుకున్న శ్రీవారి భక్తులు, శ్రీమనుతిరయన్ భక్త మండలి (చెన్నై) యాత్రికులకు మంగళవారం ఏకవీర సేవా ఫౌండేషన్ తిరుచానూరు కేఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద అన్న ప్రసాదాలు అందజేసింది. ప్రతి ఏటా తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి సహకారంతో ఈ వితరణ చేస్తుండటం విదితమే. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ యోగానంద రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గంగాధర్, జేజి రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, నరసింహారెడ్డి ఏకవీర సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాకాలలో పోస్టల్ ఉద్యోగులకు..

పాకాల : స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యులు పోస్టాఫీస్ కార్యాలయ సిబ్బందికి, కార్మికులకు మంగళవారం భోజన వితరణ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లయన్ తులసీరామన్, సభ్యులు టి.జయరామనాయుడు, ఎం.కుప్పుస్వామినాయుడు, ఎస్.దామోదర్‌నాయుడు, ఎం.కృష్ణమూర్తినాయుడు, రీజినల్ చైర్మన్ జి.రామయ్య, డిస్టిక్ చైర్మన్ ఆర్‌వి.ప్రసాద్, గ్లోబల్ టీం లీడర్ కెఎస్.మస్తాన్, సీనియర్ సభ్యుడు మునస్వామి, బాస్కరన్, భాస్కర్‌శెట్టి, గురుస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 76,773 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,100 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

జాతీయ స్థాయి పోటీలకు తిరుపతి విద్యార్థినులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: కర్నూలు వేదికగా ఈనెల 4, 5వ తేదీల్లో జరిగిన సౌత్‌జోన్ సీనియర్ లాక్రోస్ చాంపియన్ షిప్-2025లో పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. జమ్ము కాశ్మీర్ వేదికగా నవంబర్ 28వ తేదీ నుంచి జరగనున్న జాతీయ స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన కే శశిరేఖ, సౌమ్య, పూజిత ను అభినందించారు. కళాశాల కీర్తి ప్రతిష్టలను జాతీ య స్థాయి తీసుకెళ్లిన విద్యార్థులు ప్రశంసనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీడీ సాయి సుమతి, అధ్యాపకులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు.

పల్లినేనికి నివాళి



నివాళులర్పిస్తున్న లోకేష్

చంద్రగిరి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడుకు మంత్రి లోకేష్ నివాళులు అర్పించారు. మంగళవారం ఉదయం మండలంలోని పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లెలోని సుబ్రమణ్యం నాయు డు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే నాని పాల్గొన్నారు.

12న గార్లపాటి పురస్కారాలు ప్రదానోత్సవం



మాట్లాడుతున్న గార్లపాటి దామోదర నాయుడు

తిరుపతి కల్చరల్: విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో సాహితీ రంగంలో విశేష సేవలు అందిస్తున్న సాహితీవేత్తలకు ఈనెల 12న ఉదయం 10 గంటలకు రాస్ భవనంలో గార్లపాటి పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు ఆ సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాఖ్య ఆధ్వర్యంలో 2019 నుంచి ఈ పురస్కారాలు అందజేస్తూ ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది తెలుగు భాష, సాహిత్య అభివృద్ధికి కృషి చేసిన నంది వెలుగు ముక్తేశ్వరరావు, రచయితలు మురిశెట్టి గోవిందయ్య, డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, డాక్టర్ సురేంద్ర రొడ్డ, ఆచార్య కట్టమంచి మహాలక్ష్మితో పాటు ఇద్దరు ఆదర్శ రైతులు తారాపతి, అయ్యప్ప నాయుడిని ఈ గార్లపాటి పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో విశ్వశ్రీ సాహితీ సమాఖ్య కార్యదర్శి ఆముదాల మురళి, సహాయ కార్యదర్శులు నెమిలేటి కిట్టన్న, ఏనుగు అంకమనాయుడు, ఉపాధ్యక్షులు మల్లేశ్వరరావు ,జయరాంప్రసాద్, కోశాధికారి గంగాధర ప్రసాద్ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై విహారం



గరుడ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి మంగళవారం రాత్రి గరుడ వాహనంపై భక్తులను కటాక్షించారు. పౌర్ణమి పురస్కరించుకుని తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆ తర్వాత ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు వైఖానస ఆగమోక్తంగా కలాణోత్సవం, సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

తిరుపతి గాంధీరోడ్డు: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ కూడలిలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, హనుమంతరావు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, చంద్రబాబు నాయుడు, శాంబోలా హరినాథ్, పురోహితుడు సురేష్ స్వామి, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిరమిడ్ పార్టీకి నోటీసులు

తిరుపతి అర్బన్: 'పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా'కు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా వారు వార్షిక ఆడిట్ నివేదికలో ఎన్నికల ఖర్చుల వివరాలను సకాలంలో పంపలేదని చీఫ్ ఎలక్షన్ అధికారి ఆంధ్రప్రదేశ్ వెలగపూడి వారు షోకాజ్ నోటీసులు ఇచ్చారని చెప్పారు. తిరుపతిలోని కోలా వీధిలోని పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయానికి నోటీసులు వచ్చాయని తెలిపారు. ఆ మేరకు పార్టీ అధ్యక్షులు లేదా కార్యదర్శి ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు ప్రధాన ఎన్నికల అధికారి రాష్ట్ర సచివాలయం, 5వ బ్లాకు, వెలగపూడి ఎదుట హాజరుకావాలని సూచించారు.

కార్పెంటర్స్ సంక్షేమ సంఘం నూతన కమిటీ



కార్పెంటర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేవీ.రత్నం

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర కార్పెంటర్స్(వడ్రంగి) సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నికలు జరిపినట్లు ఆ సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ రత్నం ఆచారి, వెలిగరం కుప్పాచారి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు నూతన కమిటీని ప్రకటించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా పి.బలరాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జీఆర్.బాబు ఆచారి, కోశాధికారిగా జీఆర్.దేవరాజులు ఆచారి, గౌరవ సలహాదారుడు ఎస్.మురళి ఆచారి నియమించినట్లు పేర్కొన్నారు. రెండేళ్ల పాటు కొనసాగే ఈ నూతన కమిటీ కార్పెంటర్స్ సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

స్కూలు భవన నిర్మాణానికి నిధులు మంజూరు



స్కూలు భవన నిర్మాణానికి వర్క్ ఆర్డర్ ఇస్తున్న ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలో పుదిపట్లలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో కొత్త భవన నిర్మాణానికి మండల పరిషత్ నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారు. స్థానిక ఎంపీటీసీ శ్రీకాంత్ స్కూలు భవన సమస్యను మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలుమార్లు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ మూలం చంద్ర మోహన్ రెడ్డి నిధులు మంజూరు చేశారు. వర్క్ ఆర్డర్‌ను ఎంపీటీసీ శ్రీకాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఉపేంద్ర రెడ్డి, కరమల వల్లీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

చంద్రగిరి : మండలంలోని ఏ.రంగంపేటలో మంగళవారం రాత్రి విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. యాదవవీధికి చెందిన వెంకటేష్(21) తన బావమరిది పొలంలో ఉంచిన ఫ్లెక్సీను తీసుకువస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. గ్రామస్తులు హుటాహుటిన నారావారిపల్లె సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజేఐపై దాడి దేశానికే అవమానకరం



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది

తిరుపతి సిటీ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాదుల ముసుగులో జరిగిన దాడి దేశానికే అవమానకరమని ఎస్వీయూ విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మంగళవారం వర్సిటీలోని ఎంబీఏ కళాశాల ఎదుట ప్లకార్డులు చేత పట్టుకుని నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో-కన్వీనర్ అశోక్ కుమార్, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి చిన్న, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుందర్ రాజు, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు నరసన్న, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ మోహన్, కుమార్ పాల్గొన్నారు.

మండిపడిన ఉద్యోగులు, ప్రజా సంఘాలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషమని ఎస్వీయూ బోధన, బోధనేతర సిబ్బంది, ప్రజా సంఘాలు మండిపడ్డాయి. ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి, డిప్యూటీ రిజిస్ట్రార్ నాయక్, బహుజన ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, సంగీతం సుబ్రమణ్యం, ఎం పద్మనాభం, రఘురాములు, ఉద్యోగ సంఘ నాయకులు, రాజేంద్రప్రసాద్, వాసుదేవరావు, సామ్ రాజ్, సిద్దయ్య, రెడ్డన్న, సామ్రాజ శంకర్ నాయక్, మునీంద్ర పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: సుప్రీంకోర్టు సీజేఐపై దాడి ఉదంతాన్ని ఖండిస్తూ మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు, భవన్ సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.